సాక్షి నల్లగొండ

మంగళవారం । 30 । మే । 2023



భూపోరాటం మళ్లీ మొదలైంది

తెలంగాణలో భూపోరాటం మళ్లీ మొదలైందని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు.

- 8లో



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు రామన్నపేట వద్ద అరెస్ట్ చేశారు.

- 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41°/28°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

జూన్ 3 నుంచి 17 వరకు బడిబాట

నల్లగొండ : జూన్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి 11గంటలవరకు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పిల్లలను బడిలో చేర్పించుకునే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మూడేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చూడాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న 'మన ఊరు మన బడి' కార్యక్రమాలతోపాటు ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు గురించి ప్రజలకు తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాల ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న నారి ఐలయ్య

మిర్యాలగూడ : ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంతోపాటు కొండ్రపోల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేసే కుట్రలు చేస్తుందన్నారు. నెలల తరబడి కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా పట్టణాల్లోని పేదలకు సైతం ఉపాది పనులు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి జూన్ 5న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిల్లుట్ల సైదులు, బొడ్డు బాలసైదులు, పాక గోపి, హనుమంతు, వినోద్‌నాయక్, దయానంద్, అరుణ, విజయ, లక్ష్మి, సైదులు, సతీష్, దుర్గ, సైదులు, పద్మ, శ్రీను, వెంకటేశ్వర్లు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందేలా చూస్తాం

నల్లగొండ క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు అందజేసే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కె.అపూర్వరావు అన్నారు. సోమవారం గ్రీవెన్స్ డేకు వచ్చిన 35 మంది బాధితులతో ఆమె మట్లాడారు. పూర్తి వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ ప్రజల సమస్యలను పరిష్కరించి మరింత సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుడి సమస్యలను స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

పదోన్నతి పొందడం ద్వారా బాధ్యత మరింత పెరుగుతుందని ఎస్పీ కె.అపూర్వరావు అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఏడుగురు ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా ఎస్పీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలతో మమేకమై మన్ననలు పొందాలన్నారు. అనంతరం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సన్‌గ్లాస్, కూలింగ్ హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్‌ఐ స్పర్జన్‌రాజ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, సెక్రటరీ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

31 నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

మఠంపల్లి: మఠంపల్లిలోని వీవీ పాఠశాల గ్రౌండ్‌లో ఈనెల 31నుంచి జూన్1 వరకు రెండు రోజులపాటు 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి తరుణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈపోటీల్లో తెలంగాణలోని 25జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీఈటీ సతీష్, సీనియర్ రగ్బీ క్రీడాకారులు వినోద్‌నాయక్, సుమన్‌నాయక్, రజిత పాల్గొన్నారు.

మూడు రోజులుగా మిల్లు ముందే..



గుమ్మడవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైస్ మిల్లు ఎదుట నిలిచిన ధాన్యం లారీలు

- ధాన్యం దిగుమతి కోసం 20 లారీల నిరీక్షణ..
- పట్టించుకోని అధికారులు

కొండమల్లేపల్లి : మండలంలోని గుమ్మడవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల రైస్ మిల్లు వద్ద ధాన్యపు లారీలు మూడు రోజులుగా నిలిచిపోయాయి. ధాన్యం నాణ్యతగా లేదని మిల్లు యజమాని దిగుమతి చేసుకోకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం ఓ వైపు ఆదేశాలు జారీ చేస్తున్నా.. మిల్లు యజమాని పట్టించుకోవడం లేదు. మూడు రోజులుగా లారీ డ్రైవర్లు మిల్లు ఎదుట పడిగాపులు కాస్తున్నా అధికారులు, కేంద్రం నిర్వాహకులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో లారీ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని ధాన్యం వెంటనే దిగుమతి చేసుకునేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై కొండమల్లేపల్లి సహకార వ్యవసాయ సంఘం సీఈఓ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా మిల్లు యాజమానితో మాట్లాడి దిగుమతి చేసుకునేలా చూస్తామన్నారు.

నెల గడిచినా రేషన్ రాలే..!

70 రేషన్ దుకాణాలకు నేటికీ చేరని బియ్యం

- లారీల కొరతే కారణమంటున్న అధికారులు
- లారీలు లేకున్నా టెండర్ దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు
- ఉన్న కొద్దిపాటి లారీలు ధాన్యం రవాణాకే..
- రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్న పేదలు



నల్లగొండ : మే నెల రేషన్ బియ్యం ఇప్పటి వరకు కొన్ని రేషన్ దుకాణాలకు చేరలేదు. గోదాముల నుంచి రేషన్‌షాపులకు బియ్యం రవాణా చేసే లారీల కొరత వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. లారీలు లేకుండానే కొందరు కాంట్రాక్టర్లు పౌర సరఫరాల శాఖలో బియ్యం, ధాన్యం రవాణాకు సంబంధించి కాంట్రాక్టులు పొందడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉన్న లారీలు ధాన్యం రవాణాకు వెళ్తుండడంతో బియ్యం సరఫరాకు లారీలు దొరకడం లేదు. దీంతో రేషన్ బియ్యం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

4.53 లక్షల పైచిలుకు తెల్లరేషన్ కార్డులు

జిల్లాలో 4.53 లక్షల పైచిలుకు తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వారికి ప్రతినెలా జిల్లాలో ఉన్న 991 రేషన్‌షాపుల ద్వారా ప్రభుత్వం బియ్యం అందిస్తోంది. డీలర్లు ప్రతినెల 20వ తేదీలోగా డీడీలు కడితే 30వ తేదీ వరకు రేషన్‌షాపులకు బియ్యం రవాణా అవుతాయి. ప్రతినెల 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ జరుగుతుంది.

దేవరకొండ, నకిరేకల్ ప్రాంతాల్లో..

మే నెల పూర్తవుతున్నా.. దేవరకొండ, నకిరేకల్ ప్రాంతాల్లోని 70 రేషన్ షాపులకు ఇంకా బియ్యమే సరఫరా కాలేదు. వాస్తవంగా 16వ తేదీ వరకే బియ్యం పేదలకు పంపిణీ చేయాల్సి ఉండగా ఈనెల బియ్యం రవాణాలో జాప్యం జరిగినందున 30వ తేదీ వరకు పంపిణీకి అవకాశం ఇచ్చారు. కానీ 70 షాపులకు గోదాముల నుంచే బియ్యం చేరలేదు. గడువు ముగిస్తే ఆటోమెటిక్‌గా ఆన్‌లైన్ సర్వర్ ఆగిపోతుంది. 1వ తేదీ నుంచి జూన్ కోటా కూడా పంపిణీ చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు బియ్యం రాని 70 దుకాణాల పరిధిలోని లబ్ధిదారులకు రెండు నెలల బియ్యం ఒకేసారి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందా లేదా అన్న సందిగ్ధత వీడలేదు. ఒకవేళ సర్వర్‌లో మార్పు చేయకపోతే వారు మే నెల బియ్యం కోల్పోవాల్సిందే.

లారీలు లేని కాంట్రాక్టర్లతోనే జాప్యం..

బియ్యం, ధాన్యం రవాణాకు సంబంధించి పౌరసరఫరాల శాఖ టెండర్లను పిలుస్తుంది. టెండర్‌లో పాల్గొన్న కాంట్రాక్టర్‌కు లారీలు ఉన్నాయా లేదా అనేది చూసిన తర్వాతే టెండర్ అప్పగించాలి. కానీ, జిల్లాలో 10 మంది కాంట్రాక్టర్లు టెండర్ దక్కించుకుంటే ఒక్క కాంట్రాక్టర్‌కు మాత్రమే సొంత లారీలు ఉన్నాయి. మిగతా వారు లారీ అసోసియేషన్‌పై ఆధారపడి ధాన్యం, బియ్యం రవాణా చేస్తున్నారు. కాగా, బియ్యం, ధాన్యం రవాణాకు సంబంధించి ఒకే కాంట్రాక్టు కావడంతో బియ్యం సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ధాన్యం తక్కువగా ఉన్న సమయంలో ఎలాంటి సమస్యా రాలేదు. కానీ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం దిగుబడి రావడం, జిల్లా యంత్రాంగం కూడా ఆ విధంగా కొనుగోలు చేస్తుండడంతో ఈ పరిస్థితి వచ్చింది.

మిగిలిన షాపులకు బియ్యం పంపుతాం

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలో ధాన్యం దిగుబడి వచ్చింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసే సందర్భంలో బియ్యం సరఫరాలో కొంత జాప్యం జరిగింది. ఇప్పటికే బియ్యం రవాణా దాదాపుగా పూర్తయింది. దేవరకొండ ప్రాంతంలోని మిగిలిన షాపులకు మంగళవారం ఉదయం పంపిస్తాం.

– నాగేశ్వర్‌రావు, పౌరసరఫరాల డీఎం

ఇంటింటా ఓటరు సర్వే

- కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం
- అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటన
- ఆ లిస్ట్‌తోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలు!
- జనవరి 2023 నాటికి జిల్లా ఓటర్లు 13,65,478



నల్లగొండ : ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించే ప్రక్రియలో భాగంగా అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, వలస ఓటర్ల గుర్తింపు, చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. జూన్ 23వ తేదీ వరకు సర్వే కొనసాగనుంది. అక్టోబర్ 4న తుది జాబితాను ప్రకటించనున్నారు. కాగా, 1 అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండే వారికి ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 4న ప్రచురించే ఓటర్ల జాబితా ఆధారంగానే రాబోయే సాధారణ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగానే..

2023 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ల జాబితా తయారుతోపాటు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, అందుకు అవసరమైన ఓటింగ్ యంత్రాల సిద్ధం చేయడం వంటి ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టింది. ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్లతో ఎన్నికల సంఘం సమావేశాలు నిర్వహించింది. ఇంటింటికీ వెళ్లి చేపట్టాల్సిన సర్వేపై బీఎల్‌ఓలకు సూచనలు చేసింది. సర్వేలో భాగంగా అధికారులు ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రెండో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు..

ప్రతి నెలా రెండవ శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా ఓటరు నమోదుకు, ఓటర్ల జాబితాలో పేర్లు, పోలింగ్ బూత్‌లలో దొర్లిన తప్పిదాలు సరి చేసుకునేందుకు, ఒక చోట నుంచి మరో చోటుకు ఓటును మార్చుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే జూలై 25 నుంచి అదే నెల 31 వరకు దరఖాస్తుల పరిశీలన, ఆగస్టు 2న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 22న వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటన్నింటిని పరిశీలించి వారికి వివరణ ఇస్తారు. ఆ తర్వాత 4 అక్టోబర్ 2023న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

1500 ఓటర్లు దాటితే కొత్త పోలింగ్ కేంద్రం..

ఓ పోలింగ్ బూత్ పరిధిలో 1500 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే.. అక్కడ కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు ఆవశ్యకతను బీఎల్‌ఓలు అధికారుల దృష్టికి తీసుకుపోతారు. వాటిని పరిశీలించి అధికారులు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు ఉంటే ఒక చోట తొలగించుకునే విధంగా బీఎల్‌ఓలు వారికి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటుకు సెల్ ఫోన్, ఆధార్‌ను అనుసంధానం చేసేవిధంగా బీఎల్‌ఓలు చర్యలు తీసుకుంటున్నారు.

1 జనవరి 2023 నాటికి జిల్లాలో ఓటర్లు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జండర్	మొత్తం
దేవరకొండ	1,16,489	1,13,389	06	2,29,884
నాగార్జునసాగర్	1,08,558	1,10,769	07	2,19,334
మిర్యాలగూడ	1,04,673	1,07,293	06	2,11,972
నల్లగొండ	1,11,499	1,15,360	29	2,26,888
మునుగోడు	1,21,562	1,20,011	09	2,41,582
నకిరేకల్	1,18,037	1,17,777	04	2,35,818
మొత్తం	6,80,818	6,84,599	61	13,65,478

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం రాశులు, కాంటా వేసిన బస్తాలు వర్షం నీటిలో మునిగాయి. వర్షానికి ధాన్యం తడవడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. అధికారుల వైఫల్యం కారణంగా తమ ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



పజ్జూరు కేంద్రంలో వర్షానికి తడిసి ధాన్యం

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో నిత్య కైంకర్యాలతో పాటు మండపంలో నిత్య రుద్ర హవనం నిర్వహించారు. అనంతరం అభిషేకం, అర్చనలు గావించారు. శివ పార్వతుల కల్యాణం, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో సుప్రభాతం, అర్చనలు, అభిషేకం, సుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌దే అధికారం

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నాంపల్లి : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌దే అధికారమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాంపల్లి మండలం పస్నూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్తా పని చేయలని కోరారు. ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి, గీత కార్మిక ఆర్థిక సహకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పల్లె రవికుమార్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మాడపు నర్సింహారావు, పోగుల వెంకట్‌రెడ్డి, బొల్లంపల్లి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు బాషిపాక రాములు, కొరే హేమలతయాదయ్య, బెల్టి సత్తయ్య తదితరులు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా దశాబ్ది ఉత్సవాలు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : జూన్ 2వ తేదీ నుంచి నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న ఉదయం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి కలెక్టరేట్ ప్రాంగణంలో ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా జూన్ 22 వరకు దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్పీ అపూర్వ రావు, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, డీఎఫ్‌ఓ రాంబాబు, డీఆర్‌డీ. కాళిందిని, ఆర్‌డీఓలు చెన్నయ్య, గోపిరాం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వీఓఏల రాస్తారోకో



టోల్‌ప్లాజా వద్ద రాస్తారోకో చేస్తున్న వీఓఏలు, నినాదాలు చేస్తున్న జూలకంటి రంగారెడ్డి

మాడుగులపల్లి : వీఓఏల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ మాడుగులపల్లి మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ వీఏఓల రాష్ట్ర కమిటీ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నాకు హాజరయ్యేందుకు మిర్యాలగూడ డివిజన్‌కు చెందిన వీఓఏలు బస్సులో బయల్దేరగా టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసుల తీరును నిరసిస్తూ అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిని వీఏఓలు దిగ్బంధించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అక్కడికి చేరుకొని ధర్నాకు మద్దతు ప్రకటించారు. గంటపాటు వీఓఏలు రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారిని మాడుగులపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. జూలకంటి రంగారెడ్డి పోలీసులతో మాట్లాడడంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతించారు.

37,078 మందికి గొర్రెలు

- రెండో విడత యూనిట్ల పంపిణీకి యంత్రాంగం ఏర్పాట్లు
- చివరి దశకు చేరిన డీడీల చెల్లింపు ప్రక్రియ
- ప్రభుత్వ నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అందించేందుకు సన్నాహాలు



నల్లగొండ అగ్రికల్చరల్ : గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం కింద జిల్లాలో రెండో విడత యూనిట్లు అందించేదుకు జిల్లా పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 2 నుంచి జరగనున్న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడతలో భాగంగా 28,236 యూనిట్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మొదటి విడతలో యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలును ఇచ్చారు. వీటి విలువ రూ.లక్షా 25 వేలు ఉండగా అందులో లబ్ధిదారుని వాటా 25 శాతం పోను మిగిలిన 75 శాతం ప్రభుత్వం సబ్సిడీని ఇచ్చింది.

యూనిట్ విలువ పెంపు..

ప్రస్తుతం ఇస్తున్న రెండో విడత పంపిణీకి యూనిట్ విలువను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. యూనిట్‌కు అదే 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉండగా వీటి విలువను రూ.లక్షా 75 వేలకు పెంచింది. అందులో లబ్ధిదారుని వాటా 25 శాతం అంటే రూ.43,750 డీడీల రూపంలో జిల్లా పశుసంవర్ధక శాఖకు చెల్లించాలి. అయితే రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 37,078 మంది గొల్ల కురుమలను ఎంపిక చేసిన జిల్లా పశు సంవర్ధక శాఖ వారిని నుంచి డీడీలు తీసుకుంటోంది. ఈ ప్రక్రియ చివరి దశకు చేరింది. ప్రభుత్వం ఇస్తున్న యూనిట్ విలువలో గొర్రెల యూనిట్లతో పాటు రవాణా, ఇన్సూరెన్స్, దాణా, మందులను అందజేయనున్నారు. గొర్రెలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప, అనంతపురం జిల్లాల నుంచి కొనుగోలు చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పశు సంవర్ధక శాఖ పూర్తి చేసింది.

కలెక్టర్ నేతృత్వంలో కొనుగోలు కమిటీ..

గొర్రెల కొనుగోలుకు అవసరమైన కమిటీని కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేయనున్నారు. కమిటీ నియమించిన అధికారితో పాటు లబ్ధిదారుడు, పశువైద్యాధికారి కడప, అనంతపురం మార్కెట్లకు వెళ్లి లబ్ధిదారుడికి నచ్చిన గొర్రెలను కొనుగోలు చేసి గ్రామానికి చేరవేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 5వ తేదీ లేదా, జూన్ 9వ తేదీన యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. అయితే యూనిట్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం మాత్రం నిర్దిష్టమైన తేదీన ఇప్పటి వరకు ప్రకటించలేదు. ప్రభుత్వం తేదీని ప్రకటించిన వెంటనే గొర్రెలను కొనుగోలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లను జిల్లా పశుసంవర్ధక శాఖ చేసుకుంది. ఇదిలా ఉంటే జూన్ 5న నల్లగొండలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా గొర్రెల యూనిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

దళారుల ప్రమేయం ఉండదు



గొర్రెల యూనిట్ల పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వ తేదీని ఖరారు చేయలేదు. తేదీని ఖరారు చేసిన వెంటనే గొర్రెల కొనుగోలుకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ లబ్ధిదారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి కొనుగోలు చేసి తీసుకొస్తుంది. దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుడి ఇష్ట ప్రకారం గొర్రెలను కొని అందిస్తాం.

– డాక్టర్ అంబటి యాదగిరి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

గాయపడిన యువకుడు మృతి


ఏవేలు (ఫైల్)

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన వంగాల ఏవేలు(24) ఈ నెల 28న తన స్నేహితుడు రామాచారితో కలిసి బైక్‌పై గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మర్రికుంట గ్రామ సమీపంలో గేదెలు అడ్డురావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే కిందపడ్డారు. ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న ఏవేలు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అతడిని 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బంధువులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వంగాల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు

గుండాల : కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం భువనగిరి కోర్టు తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మురారిపల్లి గ్రామానికి చెందిన మాధవికి గుండాల మండలం నూనెగూడెం గ్రామానికి చెందిన అండెం నర్సిరెడ్డితో 2011వ సంవత్సరంలో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు జన్మించిన తర్వాత మాధవికి అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. కాగా, మామ అండెం సత్తిరెడ్డి వ్యవసాయ పనులకు వెళ్లాలని నిత్యం కోడలిని వేధిస్తున్నాడు. మామ పోరు భరించలేని మాధవి 2017 జూలై 25న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిరోజులకు మాధవి మృతిచెందింది. మృతురాలి తల్లి అనుముల రాధ ఫిర్యాదు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కరరావు నిందితుడిని ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని గుండాల పోలీసులు తెలిపారు.

అనర్హులకు దివ్యాంగుల సర్టిఫికెట్!

- మానసిక స్థితి సరిగా లేదంటూ ధ్రువీకరణ పత్రాలు జారీ
- అధికారులను మచ్చిక చేసుకుని మధ్యవర్తుల దందా
- ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.40వేలు డిమాండ్
- జెర్రిపోతులగూడెంలో 20మంది అనర్హులు పింఛన్ పొందుతున్నారని ఆరోపణలు

చిలుకూరు : ప్రతి నెలా ప్రభుత్వ పింఛన్ పొందేందుకు పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు మధ్యవర్తులు జిల్లా కేంద్రంలోని అధికారులను మచ్చిక చేసుకుని అనర్హులకు దివ్యాంగుల (మానసిక స్థితి సరిగా లేదని) ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించే దందాకు తెరలేపినట్లు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.30నుంచి 40వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే, జీవితకాల పింఛన్ పొందే అవకాశం ఉండడంతో ధ్రువీకరణ పత్రం కోసం అనర్హులు డబ్బుకు వెనుకాడడం లేదని సమాచారం.


జెర్రిపోతులగూడెం పంచాయతీ కార్యాలయం

మధ్యవర్తులుగా అధికార పార్టీ నాయకులు

చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీకి చెందిన నాయకులు కొంతకాలంగా సదరమ్ సర్టిఫికెట్లు ఇప్పించే దందా సాగిస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో ఆర్థికస్థోమత కలిగి ఉన్న వారిని గుర్తించి సదరమ్ సర్టిఫికెట్‌తో కలిగే ప్రయోజనాలు వివరించి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా గ్రామంలో సుమారు 20మందికి మానసిక స్థితి సరిగా లేదని ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో ఇప్పుడు వారంతా పింఛన్ పొందుతున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

ముందే డబ్బులు తీసుకుని..

సదరమ్ సర్టిఫికెట్ కోసం మధ్యవర్తులు ముందుగా అనర్హుల నుంచి డబ్బులు తీసుకుంటారు. ఆ తర్వాత ఎవరైతే డబ్బులు ఇచ్చారో వారికి మెంటల్ (మానసిక స్థితి సరిగా లేదని) అని ముందుగా తమకు అనుకూలంగా ఉండే బేతవోలు మీ సేవ కేంద్రాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రకటించిన తేదీల్లో సదరమ్ క్యాంప్‌లో బుకింగ్ చేస్తారు. ఇందుకు తక్కువ సమయం ఉండడంతో మీ సేవ కేంద్రం నిర్వాహకులు బుకింగ్ సమయంలో సాధారణంగా వచ్చే వారిని పక్కన పెట్టి అనర్హులకు బుకింగ్ చేస్తారు. ఆ తర్వాత అనుకున్న ప్రకారం జిల్లా కేంద్రంలో సంబంధిత అధికారులకు డబ్బులు ఇచ్చి పింఛన్ పొందేందుకు కావాల్సిన దివ్యాంగుల శాతాన్ని వేయించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని తెలిసింది. ఇలా ఒక్క జెర్రిపోతులగూడెంలోనే 20మంది అనర్హులు దర్జాగా ప్రతి నెలా పింఛన్ తీసుకుంటున్నారని సమాచారం. అంతేకాక దివ్యాంగుల పెన్షన్లలో సదరమ్ ధ్రువీకరణ పత్రాల్లో లోపం 30శాతం ఉంటే డబ్బులు తీసుకొని 70 శాతం ఉన్నట్లుగా సర్టిఫికెట్లు ఇప్పించినట్లుగా తెలిసింది. దీంతో అన్ని అర్హతలు ఉన్నా తమకు మాత్రం పింఛన్లు రావడం లేదని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు గ్రామంలో దివ్యాంగుల ధ్రువీకరణపత్రాలపై విచారణ చేస్తే అసలు విషయం బయటపడుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- రూ.24 లక్షల విలువ చేసే 120కిలోల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి : గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 120కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి భువనగిరి డీసీపీ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని ఉస్మానాబాద్‌కు చెందిన రాజు షిండే, సంజయ్ చవాన్, శ్రవణ్ చున్నీలాల్ శర్మ, రాహుల్ షిండేలు ఇదే రాష్ట్రానికి చెందిన ముక్తార్ సూచన మేరకు గంజాయిని రవాణా చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల నలుగురు నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రకు బయలుదేరారు.

పోలీసులకు సమాచారం అందడంతో..

అయితే, గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులతో పాటు రామన్నపేట పోలీసులు ఈ నెల 28న రామన్నపేట పట్టణ కేంద్రంలో చిట్యాల-భువనగిరి రోడ్డు మార్గంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన కారును ఆపి అందులో ప్రయాణం చేస్తున్న నలుగురుని విచారించారు. దీంతో కారులో గంజాయి ఉన్నట్టుగా గుర్తించి వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి సుమారు రూ. 24 లక్షల విలువ చేసే 120 కిలోల గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్ ఫోన్లు, కియా కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గంజాయి సరఫరా చేస్తూ ఇతరుల సూచన మేరకు అందజేస్తుంటారు. ఎవరి సూచన మేరకు వీరు గంజాయి సరఫరా చేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. గంజాయిని పట్టుకుని పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, రామన్నపేట సీఐ మోతీరాం, ఎస్‌ఓటీ సీఐ నవీన్‌కుమార్ ఉన్నారు.


పట్టుబడిన నిందితులు, గంజాయి ప్యాకెట్లతో డీసీపీ రాజేష్‌చంద్ర, ఇతర పోలీస్ సిబ్బంది

కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు(ఎం): మండల పరిధిలోని రాయిపల్లి స్టేజీ సమీపంలో సోమవారం కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయిగిరి-మోత్కూరు రోడ్డు పక్కన ఆత్మకూరు (ఎం) మండల పరిధిలో రాయిపల్లి స్టేజీ సమీపంలో మూలమలుపు వద్ద దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. మృతదేహం పక్కన బైక్‌తో పాటు స్విచ్ఛాఫ్ అయిన సెల్‌ఫోన్ పడి ఉంది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరూ చూడకపోవడంతో కుళ్లిపోయినట్లు తెలుస్తోంది. లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా, మృతదేహం ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మొరిగాడి శివసాయి (21)గా పోలీసులు గుర్తించారు. ఫ్లవర్ డెకరేషన్ పనులు నిర్వహిస్తుంటాడు. శ్రీను తండ్రి మల్లేశం-తల్లి శారద కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శ్రీను నాయనమ్మ వద్దే ఉంటున్నాడు. ఈ నెల 22న ఫ్లవర్ డెకరేషన్ ఓనర్ వాసం ప్రసాద్‌కు చెందిన బైక్‌ను తీసుకుని బయటకు వెళుతున్నానని నాయనమ్మకు చెప్పి వెళ్లాడు. రాయిపల్లి రోడ్డు మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెంది ఉంటాడని బంధువులు పేర్కొంటున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు పానగాని శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.


శివసాయి (ఫైల్)

అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు..

- యువకుడిపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. పరిస్థితి విషమం

మిర్యాలగూడ అర్బన్: కారు వేగంగా వచ్చి అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ పక్కకు దూసుకెళ్లి వాకింగ్ చేస్తున్న యువకుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని నార్కట్‌పల్లి- అద్దంకి బైపాస్‌రోడ్డుపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట రిలయన్స్ బంక్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ వేగంగా పక్కకు దూసుకెళ్లి రోడ్డు పక్కనే వాకింగ్ చేస్తున్న వాసవీనగర్ కు చెందిన నరేష్‌ను ఢీకొట్టింది. దీంతో యువకుడికి తీవ్ర ట్రాక్టర్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు బెలూన్ తెరుచుకోవడంతో అందులో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా నరేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని టుటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


సిద్ధార్థ (ఫైల్)

సూర్యాపేట క్రైం : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేటలో సోమవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..జిల్లా కేంద్రానికి చెందిన వసంతపు సిద్ధార్థ పిల్లే(38) వాణిజ్య భవన్ సెంటర్‌లో మీ సేవ కేంద్రం నిర్వహిస్తున్నాడు. అయితే, కొంతకాలంగా కుటుంబంలో ఆస్తి తగాదాలు జరుగుతుండడంతో సిద్ధార్థ మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా సిద్ధార్థ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతున్నాడు. కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి


గణేష్ (ఫైల్)

తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వెంకటాపురంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుంటి నాగరాజు, లావణ్య దంపతుల కుమారుడు గుంటి గణేష్(20) గొర్రెల కాపరి. రోజూ మాదిరిగానే గొర్రెలను మేపడానికి తమ వ్యవసాయ బావి సమీపంలోకి తోలుకెళ్లాడు. సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా తోక చెరువు సమీపంలోని ఓ చెట్టు కిందికి గణేష్ వెళ్లాడు. గణేష్ నిల్చున్న సమీపంలోనే పిడుగు పడగా దాని ప్రభావంతో అతడు మృతిచెందాడు. పరిసర ప్రాంతంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గణేష్ జీవించి ఉన్నాడేమోనని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు కూతురుతో పాటు కుమారుడు గణేష్ సంతానం. చేతికందిన ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ అపూర్వరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీకాంత్‌గౌడ్ కేతేపల్లికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న అనిల్‌రెడ్డిని అనంతగిరి పోలీస్‌స్టేషనర్‌కు బదిలీ చేశారు. మఠంపల్లి ఎస్‌ఐ రవిని చిట్యాలకు స్థాన చలనం కల్పించగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్.ధర్మాను తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు అలాట్ చేశారు. అయితే రవి కొద్ది రోజుల క్రితమే తిప్పర్తికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వాసప్రవీణ్‌కుమార్ డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో నలుగురికి గాయాలు


బాబు (ఫైల్)

చౌటుప్పల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. చౌటుప్పల్, భువనగిరి, సంస్థాన్ నారాయణపురం మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం గ్రామంలో నివాసం ఉండే గాడ్డుల బాబు(27) ఆదివారం ఉదయం సొంతూరైన చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి వచ్చాడు. అదే రోజు రాత్రి బైక్‌పై తిరిగి కొత్తగూడేనికి బయలుదేరాడు. మార్గమధ్యలో దండుమల్కాపురం గ్రామ శివారులో ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, ఎలాంటి సిగ్నల్ లేకుండానే వాహనాన్ని హైవేపై నిలిపాడు. ఈ క్రమంలో బాబు బైక్ వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం అంబులెన్సులో చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాబు చనిపోయినట్టుగా నిర్ధారించారు. మృతుడి తమ్ముడు సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని..


శ్రీధర్ (ఫైల్)

భువనగిరి : మండల పరిధిలోని కూనూరు గ్రామానికి చెందిన వడ్డి శ్రీధర్(23) పనినిమిత్తం ఇంటినుంచి బైక్‌పై రాయగిరికి బయలుదేరాడు. ఈ క్రమంలో రాయగిరి గ్రామ సమీపంలో టిప్పర్ సైడు నుంచి శ్రీధర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీధర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే సమయంలో కూనూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి టీవీఎస్ వాహనంపై వెళ్తున్నాడు. ఇతని వాహనానికి మృతుడి వాహనం తగలడంతో స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై దిలీప్‌కుమార్ తెలిపారు. కాగా మృతుడి తండ్రి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు.

నారాయణపురంలో..

సంస్థాన్ నారాయణపురం : నల్లగొండ జిల్లా బుద్ధారం గ్రామానికి చెందిన మోహన్, తన భార్య గీతాంజలి, కుమారులు హర్షవర్ధన్ (12), సతీష్‌తో కలసి స్కూటీపై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో సంస్థాన్ నారాయణపురం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ వీరి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీపై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తెలంగాణలో భూపోరాటం మళ్లీ మొదలైంది


భువనగిరి కలెక్టరేట్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల దీక్షలో మాట్లాడుతున్న గద్దర్

- ప్రజాయుద్ధ నౌక గద్దర్
- భువనగిరిలో రీజినల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితుల దీక్షకు సంఘీభావం

సాక్షి, యాదాద్రి: తెలంగాణలో భూ పోరాటం మళ్లీ మొదలైందని ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నారు. భూమి సమస్య తెలంగాణ సమస్య అని, మహాభారత, నిజాం కాలం నుంచి నేటి వరకు భూమి సమస్య ఉందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భూనిర్వాసితులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ధరణి పేరుతో తెలంగాణలో పెద్ద కుట్ర జరిగిందని, పెట్టుబడి సాయంతో పంట భూములను బీడు భూములుగా మార్చారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌లు 25 లక్షల ఎకరాల భూములను మింగేశారన్నారు. కేటీఆర్ బంజారా భూములను గుంజుకుని అమెజాన్ సంస్థకు అమ్మేశారన్నారు. కార్పొరేట్ శక్తులకు భూములను ఇవ్వడంపై ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన భువనగిరి నుంచే మరో భూపోరాటం ప్రారంభం కావాలన్నారు. పదేళ్ల పాలనలో రైతులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. భూములు తీసుకోవడం ప్రభుత్వం వెంటనే ఆపివేయలన్నారు. రీజినల్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే రాజ్యాంగం ప్రకారం ఎకరం భూమికి.. మూడు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులు వచ్చే ఎన్నికల్లో నామినేషన్లువేసి తమ సత్తాను చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు అనే ఆయుధంతో పోరాడి మరో విప్లవాన్ని తీసుకురావాలని గద్దర్ ప్రజలను కోరారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ : మండల పరిధిలోని కొయ్యలగూడేనికి చెందిన వెంకటేశం చేనేత వృత్తిపై జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 27న ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఆచూకీ లేక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితను వేధిస్తున్న యువకుడిపై కేసు

యాదగిరిగుట్ట రూరల్: వివాహితను వేధిస్తున్న యువకుడిపై సోమవారం యాదగిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గౌరాయపల్లి గ్రామానికి చెందిన మంచు ఉదయ్ అదే గ్రామానికి చెందిన వివాహితను కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. అతడి వేధింపులు తాళలేక సదరు మహిళ సోమవారం యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఉదయ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.